

నూరేళ్ళ తెలుగు కథకు

నవ్య నీరాజనం - 87

# ఆ మహామహులంతా నా రచనలకు స్ఫూర్తి ప్రదాతలే!

**- డాక్టర్ కె.వి.కృష్ణకుమారి**

పువ్వు పుట్టగనే పరిమళిస్తుంది. కృష్ణక్కా అంతే! భగవద్గీతా సారాంశాన్ని ఉగ్గుపాలతోనే ఔపోసనపట్టి తండ్రి వారసత్వ సంపదగా 'మానవసేవే మాదవ సేవ'అనే నానుడిని జీవితాదర్శంగా చేసుకున్న డాక్టర్ కె.వి.కృష్ణకుమారి ఇంతవరకు 60 నవలలూ, వందలాది కథలూ రాశారు. శ్రీరామకృష్ణ పరమహంస దివ్యాత్మ సంభాషణతో విశ్వప్రేమ తత్వాన్ని పరమార్థంగా గ్రహించి సత్యసాయిబాబా ప్రేరణతో 'భద్రాకళ్యాణం'గ్రంథ రచన చేసి మూడేళ్ళ క్రితం సాహితీ జీవిత స్వర్ణోత్సవం చేసుకున్న కృష్ణక్కతో ఇంటర్వ్యూ మీ కోసం...



సత్యసాయిబాబాతో...

1947వ సంవత్సరం ఫిబ్రవరి 6వ తేదీన కాకినాడలో జన్మించాను. నాన్న డాక్టర్ కాజా జగన్నాథరావు, అమ్మ సత్యవతి. ఆధ్యాత్మిక పథంలో ఆత్మానందాన్ని అమ్మ తంలా పంచి ఇచ్చారు తాతగారు. మానవసేవే మాధవ సేవ అనే సత్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన నాన్నగారు నా చేయి పట్టుకుని నడిపించారు. జమీందారీ ప్రవృత్తిని పక్కకునెట్టి ఉత్తమ గృహిణీత్వానికి ప్రతీకలుగా నిలిచి నన్ను నడిపించారు అమ్మ - అమ్మమ్మ. నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా నిలిచి నన్ను గొప్ప వైద్య సేవకురాలిగా నిలబెట్టారు అంకుల్ డాక్టర్ నీలం సంజీవరెడ్డిగారు. నమ్ముకున్న వృత్తిలోనూ, చేపట్టిన బాధ్యతల్లోనూ దైవాన్ని చూడటం నేర్పారు అన్నయ్య అక్కినేని నాగేశ్వరరావుగారు. ఇలా రాసుకుంటూ పోతే ఎందరో మహానుభావులు... వారందరి గురించి విపులంగా తెలియజేయడానికి నా జీవితకాలం సరిపోదు.

## కుటుంబం

అమ్మా,నాన్నా, తాతయ్యా, తమ్ముడు శరత్ నన్ను ప్రాణప్రదంగా చూసుకున్న సావిత్రి పిన్ని, రాధపిన్ని, అమ్మమ్మ, కాలంతో బాటు కనుమరుగయ్యారు. నా అదృష్టం ఏమిటంటే నా కుటుంబంలోని ప్రతి ఒక్కరూ నన్ను 'అక్కయ్యా' అని పిలుస్తారు. ప్రేమానురాగాలు గుబాళించే పొందికైన అందమైన పొదరిల్లు మా ఇల్లు.

అమ్మమ్మ శేషమ్మగారు. జార్జ్‌పేట(యానాం) కు చెందిన జమీందార్ల (గార్లపాటి వారి) ఇంటి ఆడబడుచు. అంటే-గార్లపాటి రామకృష్ణ కవి. (తెనాలి రామకృష్ణ కవి) వంశాంకురం. తాతగారు బెండపూడి వెంకట కృష్ణారావుగారు సంగీత విద్వాంసులు. త్యాగరాజస్వామి ప్రథమ శిష్యులు. మా నాన్నగారు తెనాలిలో ప్రముఖ వైద్యులు. డాక్టర్ల ప్రవృత్తికి భిన్నంగా జేబుల నిండుగా డబ్బుతో, హాస్పిటల్‌కు వెళ్ళి ఖాళీ జేబులతో ఇంటికి తిరిగొచ్చేవారు. ఐనా ఆయన మొహం అవ్యక్తానందంతో వెలిగిపోతూ వుండేది. నాన్న చెయ్యిపట్టుకుని హాస్పిటల్‌కు వెళ్ళేదాన్ని. రకరకాల మనుష్యులు. ఏవేవో జబ్బులతో, ఎన్నో సమస్యలతో చుట్టుముట్టేవారు. నాన్న వాళ్ళ జీవిత కథలను వింటూ వోదారుస్తూ, వైద్యం చేస్తూ-డబ్బిచ్చి ఆదుకుంటుంటే, నా హృదయం మానవత్వంతో స్పందించేది. రోగులపట్ల నాన్నగారు చూపించిన ఉదారత నన్ను ఉత్తేజపరిచింది. నాన్నతో హాస్పిటల్‌కి వెళ్ళే నా పసి మనసు, వాళ్ళ వాళ్ళ సమస్యలను గురించి, వాళ్ళ బాధలను గురించి ఆలోచిస్తూ, నేనున్నానని ధైర్యాన్నిచ్చే, నాన్న వ్యక్తిత్వానికి అనువుగా నన్ను నేను మలుచుకునే దానిని. మా తాతగారింట్లో నిత్యాగ్నిహోత్రం. తాతగారు, భగవద్గీత 18 అధ్యాయాలూ, పూర్తికానిదే, కాఫీ కూడా త్రాగేవారు కాదు. ఆయన గుండెల మీద పెట్టుకుని గీతామృతాన్ని ఉగ్గుపాలతో పట్టి, పెంచి పెద్ద చేశారు నన్ను.

## శారద (నటరాజన్) కన్నీటి స్పందన

తెనాలిలో మా నర్సింగ్ హోంలో ఒక పేషెంట్. నాన్న ఆయన్ను ప్రత్యేకంగా చూసేవారు. ఆయన ఎప్పుడూ, ఏదో వ్రాసుకుంటూ వుండేవారు. ఏమిటని అడిగే వయసు నాకు లేదు. ఐనా జాలితో, నా పాకెట్‌మనీతో, కాగితాలూ, ఇంకు బాటిల్సూ ఆయనకు కొనిచ్చేదాన్ని. ''పాపా! నువ్వు గొప్ప సాహితీవేత్త వవుతావని నా మనసుకన్పిస్తోంది. కొందరు రచయితల జీవితాలు, పత్రికల వారి సర్కులేషను పెరగటానికి మాత్రమే ఉపయోగపడే ఉపకరణాలై-చాలా దుర్భరంగా వుంటాయి. విషాదాంతాలవుతాయి. నన్ను మనసులో పెట్టుకో. పెద్దయ్యాక, నీ మనసు చెప్పేది నలుగురికీ చెప్పటం మరచిపోవద్దు-'' అన్నారు. నాకు కంటనీరు తిరిగింది. ఆ వ్యక్తి క్షయ వ్యాధితో కన్నుమూశాడు. నాన్నే ఆయనకు అంతిమ సంస్కారం జరిపించాడు. ఆయన భార్యకు ఉపాధి చూపించాడు. ఆయనే ప్రఖ్యాత రచయిత 'శారద'.

## నా మొదటి రచన

కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో మెడిసిన్ పూర్తి చేశాను. తెనాలి ప్రభుత్వ హాస్పిటల్‌లో అసిస్టెంట్ సివిల్ సర్జన్‌గా, హైదరాబాద్ కింగ్ కోఠి జనరల్ హాస్పిటల్‌లో అసిస్టెంట్ సర్జన్‌గా పని చేశాను. నా సాహితీ ప్రయాణంలో ఎంతో మంది ప్రముఖ సాహితీ వేత్తలు, లబ్ధ ప్రతిష్ఠులు నాకు ఆశీస్సులు అందజేశారు. ఇప్పటివరకు 60 నవలలూ, వందలాది రచనలూ చేశాను. పదవయేట ఉండగానే వ్రాసిన మొదటి రచన 'భలేపెళ్ళి' నాటిక మా బ్రాంచి హైస్కూల్లో ప్రదర్శింపబడి, బహుమతులు అందుకుంది. ఆలిండియా రేడియోలో నండూరి విఠల్‌గారి సౌజన్యంతో 'బొమ్మరిల్లు'లో ప్రసారమైంది. 'ఒక చిన్న పిల్ల-ఇంత అర్థవంతంగా సంస్కారయుక్తంగా వ్రాసిందా' అన్న ఆశ్చర్యంతో, నన్ను చూడటానికి తెనాలి నుండి వచ్చారు సి.రామ్మోహన్‌రావుగారూ, నండూరి సుబ్బారావుగారూ. అప్పటి నుండీ వారి కుటుంబాలతో కూడా నా అనుబంధం పెనవేసుకుపోయింది.

## సాహిత్య ప్రస్థానం

1964-65 ప్రాంతాల్లో కాకినాడలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా దివ్యాశీస్సులు నాకు లభించాయి. తర్వాత 1999 ఫిబ్రవరి 6వ తేదీన నేనూ, నా ఆత్మీయ సోదరి శ్రీమతి జమున పుట్టపర్తి వెళ్ళి బాబా దర్శనం చేసుకున్నాం. అప్పుడే ఆయన 'ఓం'కార పతకమున్న సువర్ణ మాల నా మెడలో వేసి 'భద్రాకళ్యాణం' గ్రంథం వ్రాయమని ఆదేశించారు. ఆయన ఆదేశంతో కలం పట్టుకున్నానంతే! దానంతట అదే సాగిపోయి 350 పేజీల అద్వైత గ్రంథంగా రూపుదిద్దుకుంది. ఇప్పటికి ఈ గ్రంథం 32 ముద్రణలు పొందింది. పద్మశ్రీ స్థానం నరసింహారావుగారి 'నటస్థానం' రచనకు కొన్ని సలహాలతోపాటు, రచనాపరంగా చేయూతనిచ్చాను. మా అన్నయ్య డాక్టర్ అక్కినేని . ఆయన మస్తిష్క మధనం 'మనిషిలోని మనిషి డాక్టర్ అక్కినేని'. నేను రాసిన ఈ సీరియల్ ప్రముఖ పత్రికలో దాదాపు మూడు సంవత్సరాలు పైగా ప్రచురింపబడింది. గ్రంథరూపంలో లక్షలాది అభిమానులకు మార్గదర్శకమై అలరిస్తోంది.

## మహామహుల సాంగత్యం

ప్రముఖ సాహితీవేత్త శ్రీ రావూరి భరద్వాజగారు, నాన్నకు అత్యంత సన్నిహితులు. పసితనం నుంచే నన్నెంతో వాత్సల్యంతో చూసేవారు. ఇప్పటికీ నన్ను 'బంగారు తల్లీ' అనే పిలుస్తారు.

నా రచనలు ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రచురితమయ్యేవి. 'తెలుగుపూలు' శీర్షికతో రచయిత్రుల ఇంటర్వ్యూలు వచ్చేవి.

తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న సందర్భంలో, తరచు సాహితీ సదస్సులు (1972-80) నిర్వహించేవాళ్ళం. హితశ్రీ, వీరాజీ, తాళ్ళూరి నాగేశ్వరరావు, శార్వరి, కొండూరి రాఘవాచార్య వంటి ప్రముఖులతో, కథలు, ఇతర రచనలపై విశ్లేషణాత్మక చర్చలు జరిపేవాళ్ళం. పురిపండా అప్పలస్వామిగారు మా కుటుంబానికి సన్నిహితులు.



డాక్టరు నీలం సంజీవరెడ్డి గారితో...

మహామహులైన సాహిత్యవేత్తల ఆశీస్సులు లభించడం నా అదృష్టం. డాక్టర్ సి.నారాయణరెడ్డిగారు, జగమెరిగిన సాహితీమూర్తి మునిపల్లె రాజుగారు ఎంతో ఆప్యాయంగా 'కృష్ణమ్మా-అమ్మా' అంటూ ఫోన్లు చేసి నా 'భద్రాకళ్యాణం'గ్రంథానికి ఆశీస్సులందించారు. నటరాజ రామకృష్ణగారు కూడా ఒక సదస్సులో 'అక్కయ్యా' అంటూ నన్ను ఆర్ద్రంగా పలుకరించి శాలువాతో సత్కరించారు.

హైదరాబాద్‌లో పనిచేస్తున్నప్పుడు దాశరథిగారు నా వద్దకు చికిత్సకు వచ్చేవారు. సాహిత్య పరంగా మేం ఎన్నో విషయాలు మాట్లాడుకునే వాళ్ళం. డాక్టర్ మహీధర నళినీమోహన్‌గారు నన్ను 'కృష్ణక్కా' అనేవారు. ఆయన 'మెదడుకు మేత' గ్రంథాన్ని నాకు అంకితం ఇచ్చారు.



కుటుంబ సభ్యులతో...

## కృష్ణక్కగా...

1974వ సంవత్సరంలో తెనాలి ప్రభుత్వ హాస్పిటల్‌లో పని చేస్తున్న సమయంలో రెండు ప్రముఖ వార పత్రికలకు సీరియల్స్ వ్రాసే ప్రయత్నంలో వుండగా ఒక అర్ధరాత్రి శ్రీరామకృష్ణ పరమహంస దివ్యాత్మతో సంభాషించే మహద్భాగ్యం కలిగింది. అప్పుడే ఆయన నా గమ్యాన్ని నిర్దేశించారు. విశ్వప్రేమ తత్వాన్ని ప్రబోధించారు. సరిగ్గా అప్పుడే శ్రీ శార్వరిగారు తన 'మహిళ' మాస పత్రిక ద్వారా నన్ను మొదటిసారి 'కృష్ణక్క'గా పాఠకలోకానికి పరిచయం చేశారు. ఆ తర్వాత ఆంధ్రభూమి వార పత్రిక ద్వారా కొన్ని దశాబ్దాలుగా లక్షలాది అభిమానుల హృదయాలలో స్థిర నివాసం ఏర్పరచుకున్నాను. 'కృష్ణక్క'గా అనుభవాలూ, అనుభూతులూ అనిర్వచనీయాలు.

## రాజకీయ నేపథ్యం

దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారూ, మాజీ రాష్ట్రపతి వి.వి.గిరిగారూ, మాకు దగ్గర బంధువులు. టంగుటూరి ప్రకాశం పంతులుగారూ మా కుటుంబానికి సన్నిహితులే! ఐనా, మా నాన్నగారి ప్రాణ స్నేహితులు మా అంకుల్ నీలం సంజీవరెడ్డిగారంటే మాకు ప్రాణం. అంకుల్ తెనాలి ఎప్పుడొచ్చినా, మా ఇంట్లో భోజనం చేయందే వెళ్ళేవారు కాదు. 1962వ సంవత్సరంలో అంకుల్ అప్పుడు చీఫ్ మినిస్టర్. ప్రోటోకాల్‌ను కూడా లెఖ్ఖపెట్టకుండా, నాన్నతో బాటు కాకినాడ వచ్చి నేను కోరుకున్న విధంగా నన్ను రంగరాయ మెడికల్ కాలేజ్‌లో ఆడ్మిట్ చేయించారు. తర్వాత మా చెల్లెలికి కూడా సీటిప్పించారు.

1964 ప్రాంతంలో గుంటూరులో ఎ.ఐ.సి.సి. మీటింగ్ సందర్భంగా, అంకుల్‌తో రైల్లో వెళ్ళినప్పుడు లాల్ బహద్దూర్ శాస్త్రి, కామరాజ్ నాడార్, అత్యుల్య ఘోష్‌లకు మా అమ్మాయి డాక్టర్ చదువు తోందంటూ నన్ను అంకుల్ వారికి పరిచయం చేశారు. అంకుల్. ఎ.ఐ.సి.సి.లో నాకు ప్రత్యేక స్థానాన్ని కేటాయించారు. శ్రీమతి ఇందిరాగాంధీతో ఆత్మీయపూర్వకంగా మాట్లాడాను. సంజీవరెడ్డిగారి అమ్మాయిగానే నన్ను ట్రీట్ చేశారందరూ. అంకుల్ వర్ధంతి సభలను 11 సంవత్సరాలుగా నిర్వహించాను. ఆయన రాష్ట్రపతిగా వున్నప్పుడు, రాష్ట్రపతి భవనంలో కొన్ని రోజులు గడిపాం. మా అంకుల్ ఆంటీలు, ప్రేమానురాగాలను ఎప్పటికీ మరచిపోలేం.

## నచ్చినవి

| | | |
|---|---|---|
| గ్రంథాలు | : | భగవద్గీత,భాగవతం |
| రాజకీయ నాయకుడు | : | అంకుల్ డాక్టర్ నీలం సంజీవరెడ్డిగారు |
| సినీ కథా నాయకుడు | : | అన్నయ్య డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావుగారు |
| ఇష్టదైవం | : | శ్రీకృష్ణుడు |
| ఆరాధ్యనీయులు | : | భగవాన్ శ్రీ సత్యసాయిబాబా |
| చిత్రం | : | మాయాబజార్ |
| గాయకుడు | : | ఘంటసాల |
| పాట | : | కలకానిదీ విలువైనదీ... (వెలుగునీడలు) |
| దర్శకులు | : | కె.వి.రెడ్డి |
| ఆట | : | టెన్నిస్ |
| స్వీట్ | : | కాకినాడ 'కాజా' |

## అక్కినేని ఇంటి ఆడబడుచుగా...

'దేవదాసు' చిత్రం విడుదలైన నాటి నుండీ మా నాన్నకు అత్యంత సన్నిహితులైన అన్నయ్య అక్కినేని నా బాల్యంలోనే నా కెంతో చేరువయ్యారు. అక్కినేని ఇంటి ఆడపడుచుగా నా స్థానం సుస్థిరమైనది. 2007వ సంవత్సరం సెప్టెంబరు 19వ తేదీన నా సాహితీ జీవిత స్వర్ణోత్సవాన్ని అన్నపూర్ణా నిలయంలో తన 84వ జన్మదినోత్సవ సందర్భంలో అన్నయ్య అతి ఘనంగా నిర్వహించారు.

2010 సెప్టెంబరు 20వ తేదీన తన 87వ జన్మదినోత్సవం సందర్భంగా రవీంద్ర భారతిలో 'లైఫ్ టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డ్'తోబాటు, స్వర్ణ కంకణాన్ని బహుకరించారు.



లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ స్వర్ణకంకణ బహూకరణ సందర్భంగా

## ఎన్.టి.ఆర్. కోరిక

నేను హైద్రాబాద్‌లో పనిచేస్తున్న సమయంలో రామారావుగారు నన్ను రామకృష్ణ స్టూడియోకు ఆహ్వానించారు. 'యుధిష్టర పాత్ర వేసేందుకు నా రచనా సహకారం కోరారు. బ్రదర్ జీవిత చరిత్ర (మనిషిలో మనిషి) రాస్తున్నారు కదా, చూస్తున్నాను, చాలా బాగుంది, మా గురించి కూడా వ్రాయవచ్చుకదా' అని అడిగారు.నేను అప్పటికి నవ్వేసి ఊరుకున్నాను. తర్వాత ఆయన రాజకీయాల్లో ప్రవేశించారు.

నాటి రచనలు-నేటి రచనలకుచాలా తేడా వుంది. చక్కని ఉమ్మడి కుటుంబ వ్యవస్థలా, బాధ్యతాయుతంగా, గౌరవప్రదంగా,హుందాగా,పరిష్కార మార్గాలను చూపిస్తూ, పెద్దలకూ, పిల్లలకూ కూడా ఆమోదయోగ్యంగా వుండేవి నాటి పత్రికా రచనలు. కానీ ఈనాడు? అటువంటి పరిస్థితి లోపించినట్టు అన్పిస్తోంది. పువ్వులూ ఆకులు రాలిపోయి, ఎరువుగా ఉపయోగపడి,కొత్త చిగురు వేసినట్టే, సాహితీ వనం అపురూపమైన ఆరోగ్యకరమైన సాహితీ సౌరభాలను వెదజల్లే రోజులు త్వరలోనే వస్తాయని ఆశిస్తున్నాను.

– ఎస్.ఎస్.బాషా

**నాకు నచ్చిన నా కథ**

# తనదాకా వస్తే గానీ...

- డాక్టర్ కె.వి.కృష్ణకుమారి

**కా**లుతున్న ప్లాస్టిక్ కాగితాలను పట్టుకున్నట్టు వేళ్ళు భగ్గుమన్నాయి. నరనరాల్లో వ్యాపించిన వేడి, గుండెల్లో ఆవిర్లు కక్కుతోంది. ముచ్చెమటల్ని అద్దుకోవాలని ఎంత ప్రయత్నించినా, జేబులో నించి చేతిని బయటకు తీయలేక పోయాడు డాక్టర్ దయానంద్. కర్చీఫ్‌కి అంటుకుని వున్న పచ్చనోట్ల స్పర్శకు, దయానంద్ వేళ్ళు బలహీనంగా వొణుకుతున్నాయి. అలాగే నిస్సత్తువగా నుదురు అద్దుకున్నాడు. తిరిగి జేబులో పెట్టబోతున్న చెయ్యి అప్రయత్నంగా ఆగిపోయింది.

సెగలు కక్కుతున్న పచ్చనోట్ల వేడికి, భయపడి కాదు. దానిని సంపాదించి పెట్టిన తన అమానుష ప్రవర్తనకి తట్టుకోలేకా కాదు.

మానవత్వాన్నే మసి చేసిన మనసుకు సమాధానం చెప్పుకోలేక-వృత్తి ధర్మానికే తిలోదకాలిచ్చిన-తన ప్రవృత్తిని సమాధాన పరచలేక-నీరసంగా కూర్చుండి పోయిన డాక్టర్ దయానంద్ భారాన్ని మోయటం ఇష్టం లేనట్టు, ఇబ్బందిగా కదిలింది రివాల్వింగ్ ఛైర్.

సీలింగ్ ఫ్యాన్ రివ్వున తిరుగుతున్నా, చెమటను ఆపలేకపోతోంది. పేషెంట్ తాలూకు అటెండెంట్సుని సమాధాన పరుస్తునన సిస్టర్ మాటలు లీలగా విన్పిస్తున్నాయి.

"మీరు బాబును తీసుకు రావటమే చాలా సీరియస్ కండిషన్లో తెచ్చారు. నిజానికి ప్రైవేట్ డాక్టర్లెవ్వరూ ఇటువంటి కేసును తీసుకోరు. ఎటుపోయి ఎటొచ్చినా ఇటు డాక్టర్లకీ, హాస్పిటల్‌కి కూడా చెడ్డపేరే కదా. పాపం మీ మీద జాలితో డాక్టర్ గారింత శ్రమ తీసుకున్నారు. మరో హాస్పిటలైతే-ఎన్నోవేలు ఖర్చవుతుంది. మీరు ఖర్చులు భరించలేరనే ఖరీదైన మందులు కూడా సొంత డబ్బుతో తెప్పించివాడారు. ఎంత చేస్తే ఏం లాభం? ఇరవై నాలుగ్గంటల్లో ప్రాణాలు తీసే మాయదారి జబ్బొచ్చి పడింది.-"

బైట సిస్టర్ చిలక పలుకులు పలుకుతోంది.

డాక్టర్ దయానంద్ నిస్సత్తువతో తల వంచుకున్నాడు. ఇటువంటి సంఘటనల తనికి అరుదు కాకపోయినా,-ఈసారి- ఈరోజు..-ఈ సంఘటన ఎందుకో గుండెల్ని పిండి వేస్తోంది. ఎప్పుడూ లేని పాపభీతి చిత్రంగా అతడిని చుట్టుముడుతోంది. వికృతమైన బొమ్మకి ఆకర్షణీయమైన రంగులు వేసి అందంగా చూపించాలని ప్రయత్నిస్తోంది సిస్టర్. అంతకన్నా భయంకరమైన సత్యానికి, అసత్యపు పూత పూసి తన చాకచక్యాన్ని ప్రదర్శిస్తోంది.

"డాక్టర్‌గారు దేముడిలాంటోరు కనుకనే ఈ వరదాకా తిండీ తిప్పలూ మాని మాలాంటి పేదల కోసం సెమపడ్డారు-కట్టసుకాలు తెలిసిన మారాజు కనకే సొంత డబ్బులు మందుల కోసం కరుచుపెట్టారు..-నరసమ్మా..- ఆయననేం అనటంలా, నిన్ను అనటంలా-మా కరమకి బాధ పడుతున్నాం. ఒక్క నలుసును ఇచ్చినట్టే ఇచ్చి లాక్కెల్లి పోయిన ఆ దేముడిని అంటున్నాము.-

దయానంద్ నిస్తేజంగా వింటున్నాడు. ఒక్కగానొక్క కొడుకుని పోగొట్టుకుని కూడా తన మీద సడలని వాళ్ళ నమ్మకం తనని దహించి వేస్తోంది. తనని దేముడ్ని చేస్తున్న వాళ్ళ మంచితనం తన గుండెను పిండి చేస్తోంది.-తప్పంతా దేముడి మీదకే నెట్టిన వాళ్ళ మంచిమనసులూ, అమాయకత్వం, భరించరానిదిగా వుంది..-


ఆపరేషన్ థియేటరుకు తీసుకు వెళ్ళేముందు – ఆశగా, ఆమాయకంగా, నమ్మకంగా చేతులు జోడించిన ఆ పసి ప్రాణి గోపీ చూపులే వెంటాడుతున్నాయి.

తన చేతుల్ని గట్టిగా పట్టుకుని-నిశ్చింతగా-కళ్ళు మూసుకున్న అతని నమ్మకం మీద చావుదెబ్బ కొట్టాడు తను-

శాశ్వతంగా కళ్లు మూతలు పడేలా చేశాడు. గుండె కలుక్కు మంది. "ఆపరేషన్ అవసరం లేని వాడికి ఆపరేషన్ చెయ్యటం తన తప్పే.... అయినా ఆ గోపీ మరణించింది-స్పైనల్ షాక్ వలన కదా!-అనస్థటిస్ట్ తప్పది. అయినా-అతనీ సంఘటనని రొటీన్‌గా తీసుకుని మామూలుగానే వున్నాడు..-మరి? తనెందుకింతగా బాధపడుతున్నాడు?!!!-

మూలకారకుడు తానేనన్న భావం సమాధాన పడనివ్వటం లేదు. గోపీ తల్లి దండ్రుల ఏడుపు హృదయ విదారకంగా వినిపిస్తోంది. వాళ్ళ శోకాలతో హాస్పిటల్ మారుమ్రోగిపోతోంది. మిగతా పేషెంట్సు తాలూకు అటెండెట్లు జాలిగా చూస్తూ కళ్లు వొత్తుకుంటున్నారు.

వాళ్ళ ముందుకు వెళ్ళి మరోసారి ఓదార్చటం తన కర్తవ్యమనిపించింది. ఒకడుగు ముందుకు వేసి ఆగిపోయాడు డాక్టర్ దయానంద్. తనని చూడగానే గుండెలు పగిలేలా ఏడుస్తూ తనకాళ్ళ మీద పడిపోతారు. తన మీద ఎన్నో ఆశలు పెట్టుకుని వచ్చిన వాళ్ళని సూటిగా చూడగల ధైర్యం తనకుందా? గోపీని మరోసారి నిర్జీవిగా చూసి నిలద్రొక్కుకోగల స్థితిలో తనున్నాడా? చేతికందొచ్చిన ఇరవై ఏళ్ళ కొడుకుని నిష్కారణంగా పోగొట్టుకున్న ఆ నిర్భాగ్యుల స్థితి హృదయ విదారకరంగా వుంది. ఎండి పిడచగట్టుకుపోయిన వాళ్ళ గొంతులోని రక్తనాళాలను చీల్చుకుని వస్తున్న ఆర్తనాదాలు ప్రేత సంకేతాల్లా-గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. తమ గుండెల మీద పెరిగి పెద్దవాడైన – కొడుకు గుండెలమీద పడి గుండెలు బాదుకుంటుంటే-బంధువులు పెద్ద పెట్టున ఆర్తనాదాలు చేస్తుంటే ఆ వాతావరణం మరింత దయనీయంగా తయారైంది.



అతి ప్రయత్నం మీద దగ్గరకు రాబోయిన దయానంద్ అగిపోయాడు-లేదు ఆపేశాయి.

కల్మషమెరుగని ఆ నిరుపేదల హృదయాలు దయానంద్ అంతరాత్మపైన దెబ్బకొట్టి ఆపేశాయి.

అమాయక ప్రాణాలతో ఆటలాడుకుని అమానుషంగా జేబులు నింపుకునే అవినీతి డాక్టర్ల అంతరంగం తెలియని నిర్మలమైన వాళ్ళ చూపులు ఆపేశాయి.

దేముడు డాక్టరుగా-దైవస్వరూపునిగా, అందరి చేతా ఆరాధింపబడి, పేదల


పెన్నిధిగా పేరు తెచ్చుకుని, పేదల కోసమే, జీవితాన్ని , ప్రాణాన్నీ త్యాగం చేసిన, తండ్రి డాక్టర్ కృష్ణారావు ఆత్మక్షోభ తనను ఆపేసింది. ప్రాణాలతోనే వ్యాపారం మొదలు పెట్టిన తనలోని రాక్షసత్వాన్ని గ్రహించలేక, ఇంకా కృతజ్ఞతతో చూస్తున్న -వారి జాలి చూపులు మంచులా గుండెను తాకినట్టై, చల్లగా పాదాలను అంటినట్టై-ఆగిపోయాడు. కొన్ని గంటల క్రిందట వాళ్ళ కళ్ళలో వెలిగిన ఆశాజ్యోతి-ఇప్పుడు అంధకారాన్ని నింపింది.

వాళ్ళకున్న ఒకేఒక్క ఆధారం శాశ్వతంగా దూరమై వాళ్ళను జీవచ్ఛవాలను చేసింది. కారణాన్ని వాళ్ళు ఊహించలేరు. వారిలోని అమాయకత్వం ఆలోచింపనివ్వదు.

ఐనా.... ఆ నిప్పులాంటి నిజం-వాళ్ళ కడుపుశోకం-తనని శపించకుండా వుంటుందా?! ఆ శాపం తనకి తగలకుండా వుంటుందా??

జేబులో వాళ్ళిచ్చిన పచ్చనోట్లు గుండెను క్రిందికి లాగేస్తున్నాయి. ప్రేగుల్ని మెలిపెడుతున్నాయి-

అంతలో-హడావుడిగా ఐదారుగురు స్టూడెంట్సు-మరో స్టూడెంట్‌ని టాక్సీ లోంచి దింపుతున్నారు. కంగారులో తడబడుతున్న వారి చేతుల్లోని 'అతను' బాధతో మెలికలు తిరిగి పోతున్నాడు.



''డాక్టర్ అంకుల్ ఎక్కడ? రాజేష్ సీరియస్ -''

వారి కంగారుకు సమాధానంగా ముందుకొచ్చిన డాక్టర్ దయానంద్ ప్రాన్నడిపోయాడు.

మంచుకొండ తలమీద బలంగా తాకింది.

అగ్నిపర్వతం గుండెల్లో బ్రద్దలైంది.

నిస్తేజంగా నిలబడ్డ దయానంద్ దగ్గరకు తీసుకువచ్చారా పేషంట్‌ని. మామూలుగా అయితే అటువంటి పేషెంట్ స్థితిని బట్టి-రాబట్టుకునే డబ్బును అంచనాలు వేసుకుంటూ అత్యుత్సాహం కనబరచే దయానంద్ పాలిపోయి నిలద్రొక్కుకునే శక్తి లేనట్టు తూలి పడబోతుంటే...బలంగా పట్టుకున్నారు హాస్పిటల్ స్టాఫ్.

''బాబుకి...బాబుకేమైంది? నా బాబుకేమైంది?''...చూడగానే బాబు పరిస్థితి అర్థమైపోయింది దయానంద్‌కి.

''అంకుల్! అందరం పిక్నిక్‌కి సరదాగానే వెళ్ళాం. వెళ్ళిన కాసేపటిదాకా బాగానే వున్నాడు. తరువాత వొంట్లో బాగాలేదని దేంట్లోనూ పార్టిసిపేట్ చెయ్యకుండా-గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుని పడుకున్నాడు. అవసరమొస్తే పిలవమని చెప్పాం. పిలుపురాకపోతే రెస్ట్ తీసుకుంటున్నాడనుకున్నాం. వాడ్ని డిస్ట్రబ్ చెయ్యకూడదనుకున్నాం...-పొద్దుటే చూసేసరికి కడుపునొప్పితో ఉంగలు చుట్టుకుపోతున్నాడు. ఎప్పట్నుంచి అలా బాధపడుతున్నాడో...వాడ్నొక్కడ్నీ గదిలో పెట్టి తలుపు వేసి మేమంతా వేరేచోట కేరమ్స్ ఆటలో మునిగిపోయాం... తప్పుచేశాం-''

దయానంద్ చెవుల్లో హోరు తప్ప వాళ్ళ మాటలేవీ విన్పించటం లేదు. కన్నీటి పొరల్ని చీల్చుకుని అతి ప్రయత్నం మీద చూశాడు. తన ఊపిరి...తన సర్వస్వం..-''నానీ!-''

ఆర్తనాదం ప్రేగుల్ని తెంచుకు వచ్చింది.

పరిస్థితి ఎంత ప్రమాదకరమైనదో క్షణాల మీద అంచనా వేయగలిగాడు. క్షణం కూడా ఆలస్యం కాకూడదు.

బాబు పొట్ట మీద చెయ్యి వెయ్యబోయి వెనకకు తీసుకున్నాడు.

అంతకుముందే ఒక అమాయకపు ప్రాణాన్ని బలితీసుకున్న ఈ చేతులు, నిర్దాక్షిణ్యంగా పసినెత్తుటిని పులుముకున్న ఈ చేతులు, అందుకు ప్రతిఫలంగా పచ్చనోట్లు అందుకున్నాయి. తనుచేసిన పాపానికిది శాపమా!

తను తీసిన అమాయకపు ప్రాణం ఇప్పుడీవిధంగా బలికోరుకుంటోందా! భగవాన్!!!

మొట్టమొదటిసారిగా భగవంతుడ్ని తల్చుకున్నాడు.

భగవంతుడి శాపం తనకు తగులుతుందని తెలిసీ.-ఏ ధైర్యంతో శరణం వేడుకుంటున్నాడు!!!

''భగవాన్! ఈ దుర్మార్గుడ్ని క్షమించమనకు. కాని నా చిట్టితండ్రిని కాపాడు'' భయపడుతూనే చేతులు జోడించాడు.

నీళ్ళు నిండిన కళ్ళకి రాజేష్ అస్పష్టంగా కనిపిస్తున్నాడు.

''అంకుల్! అసలే ఆలశ్యమైంది...ఏమిటలా నిల్చున్నారు?'

రాజేష్ స్నేహితుడు వివేక్ హెచ్చరికతో-ఉలిక్కిపడ్డాడు దయానంద్. పల్స్ అందుకుని షాకయాడు...పల్స్ అందటం లేదు..-

''మైగాడ్!...సిస్టర్!!!-''

డాక్టర్ అరుపుకి హాస్పిటల్ ఉలిక్కిపడింది.

అక్కడేవున్న సిస్టర్ మరింత దగ్గరకొచ్చింది.

''...సిస్టర్..- డాక్టర్ ప్రసాద్‌ని పిలవండి. అర్జంట్.- ఇంటస్టైనల్ అబ్‌స్ట్రక్షన్..'' ఆపరేషన్ అర్జంట్...-!''

కంగారుగా ఫోన్ దగ్గరకు వెళ్ళిన సిస్టర్ చేతులు చురుగ్గా పనిచేస్తున్నాయి.

''సార్ డాక్టర్ ప్రసాద్. అవుటాఫ్ స్టేషనట-''

డాక్టర్ దయానంద్ కళ్ళముందు పిడుగులు పడ్డాయి.

''సిస్టర్...-ప్లీజ్ కాల్...డాక్టర్ శంకర్-''

దయానంద్ గొంతు పీలగా వొణుకుతోంది.

''............''

''----''

''సార్! డాక్టర్ శంకర్ ఎమర్జెన్సీ ఆపరేషన్‌లో వున్నార్ట-''

''..............''

డాక్టర్ రమాదేవి అప్పుడే సిజేరియన్ మొదలుపెట్టారట.

''మైగాడ్!''

''డాక్టర్ దయానంద్ పిడికిళ్ళు భయంతో బిగుసుకున్నాయి. దవడలు బలంగా బిగుసుకుపోయాయి.

గుండెల్లో రక్తం గడ్డకట్టినట్లైంది.

''సార్ సార్ .... తండ్రిగా మీరు ఆపరేషన్ చెయ్యటం కష్టమే. ఐనా గుండె రాయి చేసుకోవాలి. బాబు కండిషన్ ఏమీ బాగాలేదు. మరో డాక్టర్ కోసం చూస్తూ కూర్చుంటే.....అసలు బాబే దక్కక పోవచ్చు....-''

దయానంద్ సిస్టర్‌ని అయోమయంగా చూశాడు. కన్నీటితో దైన్యంగా చూశాడు. తన 'నాని'కి తను ఆపరేషన్ చేయాలా? చెయ్యగలడా?? ఇంత వరకూ వాడికి తన చేతులతో ఇంజక్షన్ కూడా ఇవ్వలేదు. ఇవ్వలేక. అటువంటిది ఇంత మేజర్ ఆపరేషన్ చెయ్యగలడా?!!-నిర్దాక్షిణ్యంగా వాడి పొట్టను కొయ్యగలడా!!!-వాడి చిన్నారి ప్రేగులని....!''

మరొక ప్రేగుమంట బైట నుండి సూటిగా గుండెలని తాకింది.

''బాబు....-గోపీబాబూ..-మేమేం పాపం చేశామురా..-మీ అయ్య లేకపోతే బయపడేవోడివి..-మీ అయ్యమీదే కాళ్ళేసి పడుకునే వోడివి....

వొంటిగా ఏడ తొంగుంటావురా అయ్యా!....నువ్వు లేకపోతే మీ యమ్మ కూడెలా తింటుందిరా రాజా!... అసలు మేమెట్టా బతుకుతామనుకున్నావురా నాయనా!..''

డాక్టర్ దయానంద్ చేతులు చల్ల బడుతున్నాయి.....

తన ప్రమేయం లేకుండానే యమర్జెన్సీ ఆపరేషన్‌కి కావల్సిన తతంగమంతా జరిగిపోతోంది. ఒక సర్జన్‌గా బాబును సమీపించటానికి ధైర్యం చాలటం లేదు.

యాంటీ సెప్టిక్ లోషన్‌తో చేతులు కడిగినా-బ్రష్‌తో ఎంత రుద్దినా-మరిగే నీళ్ళు పోసినా-పాపపంకిలం పోవటం లేదు. చేతులు శుభ్రపడటం లేదు. అదేపనిగా చేతులు రుద్దుతున్న డాక్టర్ వంక ఆశ్చర్యంగా చూస్తున్నారు థియేటర్ స్టాఫ్ మెంబర్స్.

## డాక్టర్లంటే దైవ స్వరూపులు



1968వ సంవత్సరంలో ఈ కథ వ్రాశాను. ఇది కథ కాదు. యదార్థ సంఘటనే. డాక్టర్లను దైవ స్వరూపులుగా భావిస్తూ ప్రాణాలను వాళ్ళ చేతుల్లో పెడతారు పేషెంట్లు. నిరంతరం రోగుల సేవలోనే వుండి తన ప్రాణాలను అర్పించారు మా నాన్నగారు డాక్టర్ కె.వి.జగన్నాథరావుగారు. ఒక డాక్టరుగా,డాక్టర్లందరూ అలాగే వుండాలని ఆశపడేదాన్ని. దైవానికి ప్రతిరూపులైన డాక్టర్లనెందరినో చూశాను. దయానంద్ లాంటి డాక్టర్లు తారసపడినప్పుడు ఎంతో మనస్తాపం కలిగేది. అటువంటి వాళ్ళకి కాస్తైనా పాపభీతి కలగక పోతుందా, అన్న ఆశతో వ్రాశానీ కథని. అప్పట్లో ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రికలో ప్రచురింపబడి డాక్టర్ల మన్ననలను కూడా అందుకుందీ కథ. నేను వ్రాసిన వందలాది కథలలో నా దగ్గరున్నవి బహుకొద్ది. ఈ మధ్య కాలంలో ఇటువంటి సంఘటనలు తరచుగా వినిపిస్తున్నాయి. అందుకే బాధతో తిరిగి ప్రచురణకిస్తున్నాను.

- డాక్టర్ కె.వి.కృష్ణకుమారి
సెల్ 9704068673

త్వరగా టేబుల్ దగ్గరకు వెడితే బాబు పొట్టమీద కత్తిని పెట్టిలి. కానీ తనాపని చెయ్యలేడు....-ఆపరేషన్ మొదలు పెట్టడానికి. ఆలశ్యమైతే బావుండును. కానీ..... తను వెళ్ళక తప్పదు.ఆపరేషన్ చెయ్యకా తప్పదు...-

కానీ ఎలా? తన చేతులు శుభ్రపడటం లేదే...-శాపగ్రస్థమైన ఈ చేతులతో చేసే ఆపరేషన్ విజయవంతమౌతుందా!!-

ఏపాపం ఎరుగని తన బాబుకి తన పాపం అంటకుండా వుంటుందా? అంటుతుందా?!-

అంటితే ఎలా?ఎలా?

చలన రహితంగా నిలబడ్డ డాక్టర్ దయానంద్ ఏప్రన్‌కు, తాళ్ళు బిగిస్తున్న థియేటర్ అసిస్టెంట్ జాలిగా చూశాడు. అన్నీ సిద్ధం చేసుకున్న సిస్టర్ కళ్ళప్పగించి చూస్తోంది. నిజానికి నిముషాలమీద జరగాల్సిన ఆపరేషనిది.

యాంత్రికంగా ఆపరేషన్ టేబుల్ దగ్గరకు నడిచాడు.

''సార్ మొదలు పెట్టండి-'' ఎనస్తటిస్ట్ హెచ్చరిస్తున్నాడు. స్కాలిపల్ పట్టుకుని బాబు మొహంలోకి ఒక్కసారి చూశాడు. ఊపిరితో వుండగా ఇదే ఆఖరుసారి చూడటమా?!

ఈ ఆలోచనతో నీరుగారిపోయాడు.

బలహీనమౌతున్న వేళ్ళ మధ్య స్కాలిపల్ మరింత బలహీనంగా కదులుతోంది. నిగ్రహించుకుని....నిలద్రొక్కుకుని....స్కాలిపల్ ప్రక్కన పెట్టి ఆపరేషన్ చేయవలసిన భాగాన్ని క్లీన్ చేస్తున్న దయానంద్ కళ్ళముందు తన ధన దాహానికి బలైన గోపీ లేత పొట్టే కన్పిస్తోంది.

చిన్న టాబ్లెట్‌తో తగ్గిపోయే గోపీ కడుపునొప్పికి, తన స్వార్థం, లేని రంగులు పులిమింది. లేనిపోని జబ్బును ఆపాదించింది. అతని తల్లిదండ్రుల అమాయకత్వంతో ఆడుకుంది.

రాజేష్ అవసరాలకోసం కావలసిన పచ్చనోట్ల కోసం తను ఆరాటపడ్డాడు. వచ్చిన కేసును పోనివ్వకుండా, అయిన కాడికి సొమ్ము చేసుకోవాలనుకున్నాడు. పవిత్రమైన తన వృత్తి ధర్మానికి తిలోదకాలిచ్చాడు.

గోపీ తల్లిదండ్రుల నమ్మకాన్ని వంచనతో గెలుచుకున్నాడు.

తన జేబుల్లోంచి డబ్బులిచ్చి -హాస్పిటల్‌లోని మందుల్నే కొన్నట్టు నటించి-తిరిగి బీరువాలోనూ, జేబుల్లోనూ భద్రపరుచుకున్నాడు.

తన తండ్రి పవిత్ర వారసత్వాన్నిలా నాశనం చేశాడు. అందుబాటులో వున్నా - మందుల్ని వాడవటానికి మనసు రాలేదు. దానికితోడు స్పైనల్ షాక్!!!

జరిగినది కోల్డ్ బ్లడెడ్ మర్డర్. లైసెన్సున్న తన చేతుల మీదుగా జరిగిపోయింది...-

-అమాయకులకి గర్భశోకాన్ని మిగిల్చింది-

గర్భశోకం -- గర్భశోకం --

డాక్టర్ దయానంద్ మనసిక్కడ లేదు. అతని చేతులు స్వాధీనం తప్పుతున్నాయి.

''సార్ !-''

సిస్టర్ పెట్టిన గావుకేకకు డాక్టర్ దయానంద్ చేతులు పట్టుతప్పాయి. అదే చావుకేకలా విన్పించింది.

ఎనస్తటిస్ట్‌కి తెలిసి పోయింది. ఇక తన అవసరం లేదని.

దయానంద్ నెత్తిమీద మంచు పర్వతం బద్దలైంది.

విషయం అర్థం కావటానికి కొన్ని క్షణాలు పట్టింది.

..- అర్థమైంది.

తన పాపిష్టి చేతులతో ఆపరేషన్ చేయించుకునేటంతటి అపవిత్రుడు కాదు తన బాబు.

తన రక్తాన్ని పంచుకున్న పాపానికి తనకింత శిక్ష విధించి వెళ్ళిపోయాడు

.... ఇంక లేదు తన బాబు-'

నిల్చున్న పళంగా వొరిగి పోతున్న డాక్టర్ దయానంద్‌ని పట్టుకోవటం అసాధ్యమైపోయింది.

*